అడుగులేయగలమా...!

• గుంతలు, బురదమయంగా రోడ్డు మార్గం • కందనెల్లి తండా ప్రజలకు కష్టాలు

పెద్దేముల్, ఆగస్టు 25 : మండల పరిధిలోని కందనెల్లి తండా నుంచి కందనెల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుమార్గం పూర్తిగా గుంతలమయంగా మారింది. ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు పూర్తిగా అధ్వాన్నంగా తయారైంది .దీంతో ఆ రోడ్డు మార్గంలో ప్రయాణాలు కొనసాగించే వాహనదారులు, పంట పొలాలకు వెళ్లే రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కందనెల్లి గ్రామానికి వెళ్లడానికి కందనెల్లి తండా గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు ఉంది. చాలా ఏండ్ల నుంచి కందనెల్లి తండా ప్రజలు ఈ రోడ్డు మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో కందనెల్లి తండా గ్రామం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడినప్పుడు కందనెల్లి గ్రామానికి అనుబంధంగా గ్రామంగా కందనెల్లి తండా గ్రామం ఉండేది. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు, నాయకులు స్పందించి కందనెల్లి తండా నుంచి కందనెల్లి వరకు ఉన్న రోడ్డు మార్గాన్ని బాగుచేయించి కందనెల్లి తాండ ప్రజల,రైతుల కష్టాలను తీర్చాలని వేడుకొంటున్నారు.

నానా ఇబ్బందులు పడుతున్నాం..

ఆ రోడ్డు మార్గంలో ప్రయాణం చేయలేక నానా ఇబ్బందులు పడు తున్నాం.. వర్షం పడితే చాలు కనీసం పొలాలకు, కందనెల్లి గ్రామానికి వెళ్లలేని పరిస్థితి. ప్రతిరోజూ ఈ రోడ్డు మార్గంలో ఎంతో మంది రైతులు తమ పంట పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా రైతులు, కందనెల్లి తండా ప్రజల కష్టాలను చూసి ఉన్న తాధి కారులు, నాయకులు స్పందించి ఈ రోడ్డును బాగుచేయించాలి

–విజయ్, కందనెల్లి తండా గ్రామస్తుడు, పెద్దేముల్

రోడ్డుపైనే సంత.. వాహనదారులకు తంట

–మార్కెట్ షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ప్రారంభం కాని పనులు

తుంకిమెట్లలో రోడ్డుపైనే జరుగుతున్న సంత

బొంరాస్‌పేట, ఆగస్టు 25 : మండలంలోని తుంకిమెట్లలో ప్రతి ఆదివారం వారాంతపు సంత జరుగుతుంది. ప్రారంభంలో సంత చిన్నగా ఉన్నా రానురాను ఇది విస్తరించింది. తుంకిమెట్ల–కోస్గి రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని తమ ఉత్పత్తులను అమ్ముకుంటుంటారు. మండలంలోని బొంరాస్‌పేట, తుంకిమెట్ల, నాగిరెడ్డిపల్లి, కొత్తూరు, వడిచెర్ల, లింగన్‌పల్లి, నాందార్‌పూర్, ఏర్పుమళ్ల, బాపల్లితండా, మెట్లకుంట, బురాన్‌పూర్, మదన్‌పల్లి,గిరిజన తండాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో సంతకు సరుకులు కొనడానికి వస్తుంటారు. మండలం నుంచే కాకుండా పరిగి, కొడంగల్ ప్రాంతాల నుంచి రైతులు, వ్యాపారులు కూరగాయలు, ఇతర వస్తువులను విక్రయించేందుకు సంతకు వస్తుంటారు. ఉద యం నుంచి మధ్యాహ్నం వరకు సంత జరుగుతుంది. ఏటేటా సంతలో దుకాణాలు పెరుగుతున్నాయి, కొనుగోలుదారులు పెరుగుతున్నారు కానీ ఇరుకు రోడ్డుపై సంత జరుగుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుంకిమెట్ల–కోస్గి రోడ్డుపై రోజూ వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. పక్కనే హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి కూడా ఉంది. వ్యాపారులు, కొనుగోలుదారులతో సంత కిక్కిరిసిపోవడంతో వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కి అటు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సం త రద్దీగా ఉండడంతో సండ ల్లో సడేమియాలాగ దొంగలు కూడా ప్రజల జేబుల నుంచి సెల్‌ఫోన్లు, నగదును దొంగిలిస్తున్నారు.

ప్రారంభం కాని మార్కెట్ షెడ్ల నిర్మాణం

తుంకిమెట్లలో రోడ్డుపై సంత నిర్వ హణ వల్ల కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విలేజ్ హ్యాట్ పథకం కింద షెడ్ల నిర్మాణానికి రెండేళ్ల కిందట ప్రభుత్వం ఉపాధిహామీ పథ కం కింద రూ.15 లక్షలను మంజూరు చేసింది. గ్రామంలోని రైతు వేదిక సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో షెడ్ల నిర్మాణానికి అప్పటి మంత్రి సబితా రెడ్డి శంకుస్థాపన చేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. షెడ్ల నిర్మాణం పూర్తయితే వ్యాపారులు వాటిలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని కూరగాయలు, ఇతర వస్తువులను అమ్ముకునే అవకాశం కలుగుతుంది. వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోతాయి. మార్కెట్ షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

తుంకిమెట్లలో రోడ్డుపైనే జరుగుతున్న సంత

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి, ఆగస్టు 25 : క్రీడల్లో గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పరిగిలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. టోర్నమెంట్‌ల నిర్వహణతో క్రీడాకారుల నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. పరిగి పట్టణంలో అనేక రాష్ట్రస్థాయి, అంతర్ రాష్ట్ర స్థాయి క్రీడలకు వేదికగా నిలిచిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, నాయకులు శ్రీనివాస్, క్రీడాకారులు కృష్ణమూర్తి, పి.రఘు, క్రాంతి, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి, అగస్టు 25 : మండలంలోని ఘనాపూర్ గ్రామానికి చెందిన వడ్ల సంఘమేశ్వర్ వికారాబాద్ జిల్లా బీసీ యువజన సంఘం ప్రధానకార్యదర్శిగా ఆదివారం నియమితులయ్యారు.. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగాసంఘమేశ్వర్ మాట్లాడుతూ బీసీ కులగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, అదే విధంగా జిల్లాలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తాన్నారు.. ఈ కార్యక్రమంలో శేఖర్, మల్లేశ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

వాస్తు దోషానికి పరిహారం పేరిట మోసం

వెంగళరావునగర్, ఆగస్టు 25: వాస్తు దోషానికి పరిహారం చేస్తానని నమ్మబలికి ఓ జ్యోతిష్యుడు రూ.2 లక్షలు దండుకున్న ఘటనపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలోని సాయి శ్రీనివాస్ రెసిడెన్సీలో నివాసముండే గజం నర్సింగరావు (69) రిటైర్డ్ ఉద్యోగి. నర్సింగరావుకు వాస్తు పట్టింపులు ఉన్నాయి. తనకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, ఆ సమస్యలు తీర్చాలని కోరుతూ గత మార్చి నెలలో అదే ప్రాంతంలో నివాసముండే వాస్తు నిపుణుడు మానాపురం ఉమా మధుసూదన్‌రెడ్డిని కలిశాడు. నర్సింగరావు ఇంటిని చూశాక.. మీ ఇంటికి వాస్తు దోషం ఉన్నదని.. దోష పరిహారం చేస్తానంటూ మధుసూదన్‌రెడ్డి నమ్మబలికాడు. తనకు ఎంతో పలుకుబడి ఉన్నదని, బ్యాంకు అధికారులకు చెప్పి పీఎంఆర్‌వై పథకం కింద రూ.30 లక్షలు ఇప్పిస్తానని చెప్పి.. కమీషన్‌గా రూ.2 లక్షలు ముందే తీసుకున్నాడు. జూన్ నెలలో రూ.2 లక్షలు ఇచ్చినా.. ఇప్పటికీ ప్రభుత్వ సాయం అందలేదు. ఆరా తీసేందుకు జ్యోతిష్యుడి ఇంటికి వెళ్లగా.. ఏవో కారణాలు చెబుతూ వచ్చాడు. కొద్ది రోజుల తర్వాత చూడగా ఇంటికి తాళం వేసి ఉడాయించాడు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే విధంగా.. ఉమా మధుసూదన్ రెడ్డి నివాసముండే అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్ ఎస్.రాంబాబు వద్ద కూడా డబ్బులు తీసుకున్నాడు. రాంబాబు కుమారుడికి ఇండియన్ నేవీలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.3 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో తన రాజకీయ పలుకుబడితో డబుల్ బెడ్రూమ్ ఇప్పిస్తానని నమ్మబలికి మరో లక్ష దండుకున్నాడు. మొత్తం నాలుగు లక్షలు తీసుకుని ఇంటికి తాళం వేసి ఉడాయించడంతో వాచ్‌మన్ రామ్‌బాబు ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు మరో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న మధుసూదన్ రెడ్డి కోసం గాలిస్తున్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన ..

వికారాబాద్, ఆగస్టు 25 : శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం వికారాబాద్ పట్టణంలోని శ్రీ బుగ్గరామలింగేశ్వరాలయంలో వీరశైవసమాజం ఆధ్వర్యంలో లక్షబిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. శివలింగానికి లక్ష బిల్వాలతో పూజించారు. ఈ పూజా కార్యక్రమానికి వికారాబాద్ పట్టణంలోని భక్తులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మంత్రోచ్చరణలతో శివలింగానికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఆత్మలింగం, వీరన్న, వీరేశం వీరశైవ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోని అధికారులు

గుంతలను పూడుస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, ఆగస్టు 25: రోడ్లపై ఉన్న గుంతలతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి తెలిపారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలను ఇసుక సిమెంట్‌తో కలిపి పూడ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అస్సాం బేకరీ నుంచి ఆర్యవైశ్య కళ్యాణ మండపం వరకు పాడైన రోడ్డుపై కొన్ని నెలలుగా మున్సిపల్ అధికారులకు వందలసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోకపోవడంపై ఆయన మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కంకర ఇసుక సిమెంట్ కలిపి ఒక ట్రాక్టర్లో నింపుకొని గుంతలు పూడ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మిగిలిన రోడ్ల మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జ్ శ్రీధర్ రెడ్డి, బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, జిల్లా నాయకులు పోకల సతీశ్, బుస్స శ్రీకాంత్, మా శారద హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రాజశేఖర్, టౌన్ ప్రెసిడెంట్ నరోత్తం రెడ్డి, మాజీ టౌన్ ప్రెసిడెంట్ రాజేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు శ్రీకాంత్ రెడ్డి, శరణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డంపింగ్.. టిప్పర్లను సీజ్ చేసిన పోలీసులు

దుండిగల్, ఆగస్టు 25: నిర్మాణ రంగ వ్యర్థాల అక్రమ డంపింగ్‌కు పాల్పడుతున్న మరో మూడు టిప్పర్లను బాచుపల్లి పోలీసులు సీజ్ చేశారు. ఇతర ప్రాంతాల నుంచి భవన నిర్మాణ వ్యర్థాలను రాత్రి వేళల్లో తీసుకొచ్చి నివాస ప్రాంతాలు, ప్రభుత్వ భూముల్లో డంపింగ్ చేస్తున్న 5 టిప్పర్లను గురువారం రాత్రి బాచుపల్లి పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. సంబంధిత టిప్పర్లు ఒక్కొక్కదానికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించిన విషయం విధితమే. జీహెచ్ ఎంసీ పరిధిలోని గాజులరామారం, సూరారం, కైసర్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ఈ భవన నిర్మాణ వ్యర్థాలను రాత్రివేళల్లో తీసుకొచ్చి బాచుపల్లి డబుల్ బెడ్రూం ఇండ్ల సమీపంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 186లో డంపింగ్ చేస్తున్నారు. పోలీసులు సదరు టిప్పర్లను సీజ్ చేసిన నేపథ్యంలో అక్రమ డంపింగ్‌కు పాల్పడుతున్న టిప్పర్ల యజమానులు తమ రూట్ మార్చుకుని ప్రగతినగర్‌ను ఆనుకొని ఉన్న మిథిలానగర్ సమీపంలోని ప్రభుత్వ ఖాళీ ప్రదేశాల్లో నిర్మాణ వ్యర్థాలను పడవేస్తున్నారు.

అయితే, రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జాము 5 గంటల వరకు నిర్విరామంగా నివాసప్రాంతాల మధ్య టిప్పర్లు తిరుగుతుండటంతో విపరీతమై శబ్దకాలుష్యం చోటు చేసుకుంటుంది. దీంతో పలువురు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శనివారం అర్ధరాత్రి జగద్గిరిగుట్ట నుంచి నిర్మాణ వ్యర్థాలతో వస్తున్న మూడు టిప్పర్లను పోలీసులు సీజ్ చేశారు. టిప్పర్ యజమానుల వైఖరిలో మార్పు రాకుంటే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌రావు హెచ్చరించారు.

లైంగికదాడి కేసులో వ్యక్తి అరెస్టు

శేరిలింగంపల్లి, ఆగస్టు 25: లైంగికదాడి కేసులోని నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. మాదాపూర్ ఏసీపీ కథనం ప్రకారం.. గచ్చిబౌలి నివాసి ఎస్.ప్రభాకర్ రెడ్డి డీఎల్ ఎఫ్ ఐటీ పార్కు వద్ద వరలక్ష్మి టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ యువతి (35)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కొంతకాలం కలిసి ఉన్నారు. ప్రభాకర్ రెడ్డి తనను నమ్మించి మోసం చేశాడని, పెండ్లి చేసుకుంటానని చెప్పి లొంగదీసుకున్నాడంటూ బాధిత యువతి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిపై లైంగికదాడి, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
PLOT FOR SALE
★ కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326218
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గోకుల్ చాట్ పేలుళ్లకు 17 ఏండ్లు..

– బాధితుడు సయ్యద్ రహీమ్‌ను ఆదుకోవాలని సీఎంను కోరిన బాధితులు

బాంబు పేలుళ్లలో అమరులైన వారికి నివాళులర్పిస్తున్న బాధితులు సయ్యద్ రహీమ్, కరుణాకర్, మహ్మద్ ఇబ్రహీం

సుల్తాన్‌బజార్, ఆగస్టు 25: గోకుల్ చాట్‌లో బాంబు పేలుళ్లు సంభవించి 17 ఏండ్లు పూర్తయ్యింది. 2007, ఆగస్టు 25న కోఠి గోకుల్ చాట్, లుంబినీ పార్కు వద్ద జరిగిన బాంబు పేలుళ్లలో చాలా మంది అమరులయ్యారు. చాలా మంది గాయపడ్డారు. గాయపడిన బాధితుల్లో సయ్యద్ రహీమ్ ఒకరు. రహీమ్ కన్నుపోయింది. ఈ పేలుళ్ల ఘటనను గుర్తు చేసుకుంటూ ఆదివారం మిగతా బాధితులతో కలిసి సయ్యద్ రహీమ్ కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2007, ఆగస్టు 25న జరిగిన జంట పేలుళ్లలో 42 మంది అమాయక ప్రజలు మృత్యువాత పడ్డారని, సుమారు 300లకు పైగా తీవ్రంగా గాయపడి నేటికి మానని గాయంగానే మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పేలుళ్లు జరిగిన రోజే మరణించినా బాగుండేదని, గాయాలతో జీవించలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి తమలాంటి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రతి ఏడాది ఆగస్టు 25న బాంబు పేలుళ్ల బాధితులు కలిసి ఈ ఘటనలో అమరులైన వారికి ఘనంగా నివాళులర్పిస్తున్నామన్నారు. ఈ పేలుళ్లలో తాను ఒక కన్ను పూర్తిగా కోల్పోయానంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ఉన్న నగరంలో జరిగిన ఉగ్ర దాడితో నెత్తుటి మరకలు నేటికి చెదిరిపోలేదన్నారు. బాంబు పేలుళ్ల బాధితుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు స్పందించి డబుల్ బెడ్రూం ఇండ్లు, బస్‌పాస్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

క్రైస్తవ ఆధ్యాత్మిక సంస్థలో విభేదాలు దారుణం

చిక్కడపల్లి, ఆగస్టు 25: సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రైస్తవ ఆధ్యాత్మిక సంస్థలో విభేదాలు సృష్టించడం దారుణమని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుషలేము మత్తయ్య అన్నారు. గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలోకి ఆదివారం పోలీసులు ప్రవేశించారని తెలిపారు. చర్చి ట్రస్ట్ సభ్యులు ఎఫ్‌సీ పీటర్, జాన్ సుబ్బారెడ్డిని బలవంతంగా వేదికపైకి తీసుకెళ్లి ప్రార్థనల్లో భక్తులకు అసౌకర్యం కలిగించడం సరికాదన్నారు. చర్చిలో సొసైటీ కార్యదర్శి పీటరాచారి వర్గాన్ని పోలీసులు బెదిరించారన్నారు.ఏదైనా న్యాయ సమస్యలుంటే ప్రార్థనల ముందు లేదా ప్రార్థనల తర్వాత అధికారికంగా పరిశీలించాలన్నారు. చర్చల ద్వారా కోర్టు పరిధిలో నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

చోరీ కొచ్చాడు.. సచ్చాడు

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ డబ్బా తెరిచేందుకు విఫలయత్నం

గుండె పై జారిపడ్డ డబ్బా..అక్కడికక్కడే దొంగ మృతి

ఎల్లారెడ్డిగూడలో ఘటన

వెంగళరావునగర్, ఆగస్టు 25: అర్ధరాత్రి దాటాక ఫాస్ట్ ఫుడ్ సెంటర్ డబ్బాలో చోరీ చేసేందుకు వచ్చాడో దొంగ. ఫాస్ట్ ఫుడ్ సామగ్రితో అధిక బరువుగా ఉన్న డబ్బా ర్యాక్‌ను తెరిచేందుకు విఫలయత్నం చేశాడు. బలాన్నంతా ఉపయోగించి డబ్బాను అటూ ఇటూ ఊపాడు. పట్టుతప్పి ఆ డబ్బా దొంగోడి గుండెపై జారిపడింది. అంతే.. ఆ దొంగ డబ్బా కిందే ఇరుక్కుపోయి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన ఎల్లారెడ్డిగూడలో చోటు చేసుకున్నది. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ ప్రధాన రహదారిపై ఉన్న ఆగ్రా స్వీట్ హౌస్ బయట ఉన్న ఫాస్ట్ ఫుడ్ స్టాల్ వద్దకు ఆదివారం అర్ధరాత్రి 3.30 గంటల సమయంలో సుమారు 35 ఏండ్ల వయస్సున్న ఓ దొంగ వచ్చాడు. అమీర్‌పేట నుంచి యూసుఫ్‌గూడకు వెళ్లే ఈ రోడ్డు పక్కనే ఉన్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్ డబ్బాలో చోరీ చేయడానికి విఫలయత్నం చేశాడు. డబ్బాకు ఉన్న ర్యాక్‌ను తెరిచేందుకు ప్రయత్నించినా.. అది తెరుచుకోలేదు. దీంతో డబ్బాను పట్టుకుని తన బిలాన్ని అంతా ఉపయోగించి అటూ ఇటూ ఊపాడు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో నిల్వ ఉంచిన కిరాణా సామగ్రితో ఉన్న ఆ డబ్బా పట్టుతప్పి దొంగోడిపై పడింది. డబ్బా కిందే దొంగ చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

మృతుడ్ని గుర్తించిన కుటుంబీకులు

చోరీకి వచ్చి ప్రాణాలు కోల్పోయిన ఈ దొంగ ఎవరనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన తన భర్త పాపారావు (30)తిరిగి రాలేదని మృతుడి భార్య ఎస్ఆర్ నగర్ పోలీసులను సంప్రదించారు. ఎల్లారెడ్డిగూడలోని మృతదేహాన్ని చూసిన ఆమె పాపారావుగా గుర్తించింది. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడికి చెందిన తాము అమీర్‌పేట ధరమ్‌కరమ్ రోడ్డులో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నామని పోలీసులకు చెప్పారు.

సీసీటీవీ ఫుటేజీలో నమోదైన దృశ్యాలు

చోరీకి వచ్చి.. ప్రమాదవశాత్తూ మృతి చెందిన వాచ్‌మన్ పాపారావు కేసుకు సంబంధించి నమోదైన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు సేకరించారు. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో డబ్బా పడటంతో పాపారావు మృతి చెందిన దృశ్యాలు రికార్డయ్యాయి. చోరీ చేయడానికి వచ్చి.. ప్రాణాలు కోల్పోయిన పాపారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖాన మార్చూరీకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.